సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 26 । మే । 2023



యువత రక్తదానం

విశాఖ: తలసేమియా, క్యాన్సర్ రోగుల కోసం మదర్స్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు.



సిరులతల్లికి సహస్ర తులసిపూజ

విశాఖ: కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ ఘనంగా జరిగింది.



ఈదురు గాలుల బీభత్సం

కోటవురట్ల, బుచ్చెయ్యపేట మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. చెట్లు నేలకొరిగి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 8లో

పాడి రైతులకు బీమా ధీమా

- పశువులు మరణిస్తే బీమా పరిహారం వర్తింపు
- మూడేళ్ల కాలానికి ప్రీమియంలో 80 శాతం రాయితీ,
- లబ్ధిదారుల వాటా 20 శాతం

సాక్షి, అనకాపల్లి : విపత్తులు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వివిధ రకాల వ్యాధులు, విద్యుదాఘాతాలతో ఏటా వేలాది మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. తమ కుటుంబ పోషణకు వీటిపైనే ఆధారపడి జీవించేవారు ఆ జీవాలు మరణిస్తే తల్లడిల్లిపోతారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ పశువులు, పందులు మరణిస్తే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం బీమా పథకాన్ని రూపొందించింది. వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా వారికి అండగా నిలవనుంది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ప్రతిపాదనలను రూపొందిస్తోంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పశువులు, మేకలు, గొర్రెలాంటి సన్నజీవాలకూ బీమాను వర్తింపజేయనుంది.

21 రోజుల్లో బీమా పరిహారం

లబ్ధిదారుల వాటా కింద తెల్ల రేషన్‌కార్డు ఉన్న రైతులు (బిలో పావర్టీ లైన్) 20 శాతం, లేని వారు (ఎబోవ్ పావర్టీ లైన్) 50 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పశువులకు మూడేళ్ల పాటు, జీవాలకు, పందులకు 1, 2 లేదా 3 ఏళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుంది. నెలలు, సంవత్సరాల పాటు కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజుల లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ అవుతుంది.



బీమా ఇలా...

వైఎస్సార్ పశు బీమా పథకం కింద దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30వేలు వరకు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు వరకు, గొర్రెలు/మేకలు, పందులకు రూ.6000 వరకు ప్రభుత్వం బీమా సౌకర్యం కలగజేస్తోంది. లబ్ధిదారు ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకోదలచితే ఆపై మొత్తానికి పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఆవులు/గేదెలలో గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు /మేకలు, పందులలో గరిష్ఠంగా రూ.15 వేలు వరకు బీమా సదుపాయం కూడా ఉంది. ఒకవేళ లబ్ధిదారు పశువును వేరే రైతుకు అమ్మివేసినా ఆ వివరాలు 7 రోజుల్లోగా తెలియజేస్తే.. పాలసీని కొత్త ఓనర్‌కి వర్తింపజేస్తారు. బీమా పరిహారానికి 'ట్యాగ్' తప్పనిసరి.

ఆర్‌బీకేలో నమోదు

పశుబీమా సదుపాయం కోసం రైతులు తమ సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తమ పశువుల వివరాలను నమోదు చేసుకొని రైతు వాటా ప్రీమియంను ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిలో ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు పశువులకు మాత్రమే బీమా వర్తిస్తుంది. 2- 10 సంవత్సరాల వయసులో ఒక్కసారైనా ఈనిన ఆవులకు, 3-12 సంవత్సరాల వయసులో ఒక్కసారైనా ఈనిన గేదెలకు (ఒక కుటుంబానికి గరిష్ఠంగా 5 పశువుల వరకు) బీమా పథకం వర్తిస్తుంది. 6 నెలలు వయస్సు, ఆపైబడి వయసు గొర్రెలు/మేకలు, పందులకు (ఒక కుటుంబానికి గరిష్ఠంగా 50 జీవాలకు/పందుల వరకు) బీమా పథకం వర్తిస్తుంది.

చెల్లించాల్సింది 20 శాతమే..

వైఎస్సార్ పశు బీమా పథకం కింద చెల్లించే మొత్తం ప్రీమియంలో 80 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. 20 శాతం మాత్రమే పాడి రైతులు భరించాల్సి ఉంటుంది. దేశీయ, సంకరజాతి ఆవులు, గేదెలకు మూడేళ్లకు ఒక్కోదానికి లబ్ధిదారులు రూ.960 (తెల్ల కార్డు లేనివారు), ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.384 చొప్పున చెల్లించాలి. నాటు జాతికి చెందిన పశువులకు తెల్లరేషన్ కార్డు లేనివారు రూ.480, తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.192 చెల్లించాల్సి ఉంటుంది. మేకలు, గొర్రెలు, పందులకు ప్రభుత్వం ఏడాదికి రూ.90 (తెల్ల రేషన్‌కార్డు లేనివారు), తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు, ఎస్సీ,ఎస్టీ రైతులు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్లకు అయితే రూ.135, రూ.54 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

జూన్ 1 తేదీ నుంచి అమలు



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మూగ, సన్నజీవాలకు పూర్తి స్థాయిలో బీమా కల్పించే లక్ష్యంతో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని తెస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి పాడి పశువుతో పాటు మూగజీవాలు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు కూడా బీమా కల్పించాలని సంకల్పించాం. ఇందుకోసం ప్రభుత్వం 80 శాతం ప్రీమియం భరిస్తోంది. ఈ పథకం కోసం మార్గదర్శకాలు రూపొందిస్తున్నాం. జూన్ నెల ఒకటో తేది నుంచి అమలు కానుంది.

–డాక్టర్ ప్రసాద్‌రావు, పశుసంవర్ధక శాఖ జేడీ, అనకాపల్లి జిల్లా

టీఎస్ ఎంసెట్‌లో ఉమ్మడి విశాఖ విద్యార్థుల హవా



తేజశ్రీ

విశాఖ విద్య: తెలంగాణ ఎంసెట్‌లో ఉమ్మడి విశాఖ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. అనకాపల్లికి చెందిన పీలా తేజశ్రీ టీఎస్ ఎంసెట్ ఎంట్రన్స్‌లో 35వ ర్యాంకు కైవసం చేసుకుంది. నగరంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన ఆమె జేఈఈ ఓపెన్ కేటగిరిలో 225, ఓబీసీ కేటగిరిలో 41 ర్యాంకు సాధించింది. తేజశ్రీ తండ్రి పీలా వెంకట అప్పారావు గాజువాకలోని విశాఖ డెయిరీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా తల్లి సుజాత గృహిణి. కుమార్తె మంచి ర్యాంకు సాధించటంపై ఆనందం వ్యక్తం చేశారు. ఐఐటీ ముంబైలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావాలనేది లక్ష్యమని తేజశ్రీ తెలిపింది.

తెలంగాణ రాష్ట్ర ఎంసెట్-2023 ఫలితాల్లో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు సత్తా చాటినట్టు విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కేవీ రమణ వెల్లడించారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎస్. అనిరుథ్ (స్టేట్ ఫస్ట్ ర్యాంకు) ,బీ. సంజన (8వ ర్యాంకు), ప్రశాంతి శ్రీజ (10), డీ. సాకేత్ నాయుడు (14), వీ. శ్రీకర్ నిహాల్ (40) డీ. ధనుష్ సాయి (47), ఎం.అవినాష్ కుమార్ (55), ఇ. కార్తీక్(81), కె. శ్రీకార్తీక్ (86), ఎస్ సిద్ధార్థ (89), డీ. పార్థ సారథి (93) వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. పదిలోపు 3, వంద లోపు 11, ఐదు వందల లోపు 52, వెయ్యి లోపు 78 మంది విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. మెడికల్ విభాగంలో వి.సంతోషిణి (20) ఆర్. తరుణ్ కుమార్(46), ఎస్. అనిష్ కుమార్ (74,) ర్యాంకులు సాధించారు.

న్యూస్‌రీల్

అన్ని అంశాలకు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. స్థాయీ సంఘం అజెండాలో 47 అంశాలు, మరో 15 టేబుల్ అంశాలు పొందుపరిచారని, వీటన్నింటికీ ఆమోదం లభించాయని చైర్‌పర్సన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.6.61 కోట్ల పనులకు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు పలు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు డీసీ(రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, సింహాచలం, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి టౌన్: ప్రశాంతమైన వాతావరణంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవీఈవో బి.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లో 12 ప్రభుత్వ కళాశాలలు, 3 ఏపీఎస్ఆర్‌డబ్ల్యూ పాఠశాలలు, 10 పది ప్రైవేట్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 5109 మందికి గాను 4919 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1109 మందికి గాను 1013 మంది పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. పరీక్ష కేంద్రాలన్నీ సీసీ కెమేరాల నిఘాలో ఉన్నాయని, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని, ఫ్లయింగ్ స్క్వాడ్, సిటింగ్ స్క్వాడ్ బృందాలు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగేలా తనిఖీలు చేస్తున్నారని ఆమె తెలిపారు.


విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో ఆంధ్రా ఊటీ అరకు వెళ్లే రైల్వే ప్రయాణికుల, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. జూన్ 2,4,6,8,10,12,14,16,18,20,22,24, 26,28,30 తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ- కిరండూల్(08551)రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో జూన్ 3,5,7,9,11,13,15,17,19, 21,23,25,27,29, జూలై 1వ తేదీలలో బయల్దేరే కిరండూల్ -విశాఖ (08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

సముద్ర వ్యర్థాలపై సదస్సు

అల్లిపురం (విశాఖ): సముద్రంలో వ్యర్థాలను నిర్మూలించే పద్ధతులపై ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం హోటల్ గ్రీన్‌పార్కులో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఏపీ పొల్యూషన్ బోర్డు కార్యదర్శి బి.శ్రీధర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశాఖ పొల్యూషన్ బోర్డు, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రసాదరావు మాట్లాడుతూ సముద్ర వ్యర్థాలు శాశ్వత నిర్మూలన పద్ధతిపై ప్రసంగించారు. చెన్నై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రీజినల్ డైరెక్టర్ హోసోర్ దేవయ్య వరలక్ష్మీ మాట్లాడుతూ సముద్ర వ్యర్థాల పరిశుభ్రత పద్ధతులపై మాట్లాడారు. డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి కంపెనీలకు చెందిన హెచ్‌వోడీలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పలు అంశాలపై చర్చించారు.

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా డాక్టర్ నరేష్‌కుమార్



డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి(సీఎంఓహెచ్)గా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ నరేష్ తుని ఏరియా హాస్పటల్లో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్‌పై రెండేళ్ల కాల పరిమితికి జీవీఎంసీలో ప్రధాన వైద్యాధికారిగా విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి అనారోగ్య కారణంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. శాస్త్రి తదుపరి పోస్టింగ్‌కు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, విజయవాడకు రిపోర్టు చేయాలని ఆదేశించింది.

ఇంక్యుబేషన్ సెంటర్‌కు శ్రీకారం



ఇంక్యుబేషన్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



పుస్తకావిష్కరణలో ఎంపీ సత్యవతి, వ్యవసాయ వర్సిటీ అధికారి ప్రశాంతి

- విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం

అనకాపల్లి టౌన్: విలువ ఆధారిత ఉత్పత్తులకు మంచి ప్రోత్సాహం అందించే ఇంక్యుబేషన్ సెంటర్‌కు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) ఆవరణలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. పీఎంఎఫ్ఎంఈ (ప్రైమ్ మినిస్టర్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్)లో భాగంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో నెలకొల్పుతున్న ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులతోపాటు వాటి ఆధారిత ఉత్పత్తులు కూడా ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి కానున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో చెరకు, చిరుధాన్యాలు, పనసల ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇది రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో అనకాపల్లి బెల్లానికి గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి రైతులు దశాబ్దాల కాలంగా చెరకును పండిస్తూ ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 కోట్లు విడుదల చేయగా అందులో రూ.కోటితో భవన నిర్మాణం, మిగిలిన నిధులతో చెరకు, పనస, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీకి యంత్రాలను కొనుగోలు చేయనున్నామన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అదనంగా మరో రూ.30 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులకు చిరుధాన్య వంటకాలపై శిక్షణతోపాటు కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తాయని చెప్పారు.

ఆరు నెలల్లో పూర్తి

వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌తోపాటు వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి శాస్త్రవేత్తలు ఇంతవరకు 20 చెరకు వంగడాలను అందించారన్నారు. టన్ను చెరకుకు రూ.600 ఆదాయం సమకూరినట్లయితే రైతులు చెరకు పంటపై ఆసక్తి చూపుతారన్నారు. ఈ భవనాన్ని ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు మార్కెటింగ్ చేసుకునే విధంగా ప్రొడెక్టు తయారీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బెల్లాన్ని కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించడం ద్వారా లాభాలు అధికంగా వస్తాయన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలు, చెరకులో ఆధునిక పద్ధతులపై పుస్తకాలను డాక్టర్ ప్రశాంతి, ఎంపీ సత్యవతిల ఆవిష్కరించారు. చిరుధాన్యాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి ప్రభాకర్, వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు, ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎస్‌వీడీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు కాండ్రేగుల జోగినాయుడు, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, భాగ్యలక్ష్మి, అనురాధ, ఎంఎంవి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, చిరుధాన్యాల అక్కచెల్లెళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమే గెలిచింది..

- "దిశ"చూపిన పరిష్కారం

చోడవరం రూరల్: దిశ చట్టం, తద్వారా రూపొందించిన దిశ మొబైల్ అప్లికేషన్ (యాప్) మహిళలకు అండగా నిలుస్తోంది. ఈ యాప్ ఎందరికో ఆపన్న హస్తం అందించింది. పలువురు తమ సమస్యల నుంచి గట్టెక్కి ఊపిరి పీల్చుకున్నారు. అలాంటి ఘటన ఒకటి చోడవరం మండలంలో చోటు చేసుకుంది. దిశ యాప్‌ను ఆశ్రయించిన 48 గంటలు ముగియకుండానే ఓ యువతి జీవితంలో ఏర్పడిన కల్లోలానికి చక్కని పరిష్కార దిశను చూపింది. వివరాలిలా ఉన్నాయి.. బాధిత యువతిది చోడవరం మండలంలోని దుద్దుపాలెం పంచాయతీ శివారు గ్రామం బుచ్చియ్యపేట. అదే గ్రామానికి చెందిన వెంకటేష్ ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ప్రేమించుకున్నారు. ఇద్దరివీ వేర్వేరు కులాలు కావడంతో వీరి పెళ్లికి ఇరు కుటుంబాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. యువతికి ఇటీవలే అనకాపల్లి మండలానికి చెందిన మరో యువకునితో వివాహం జరిపించారు. ప్రేమికుడు వెంకటేష్ గతంలో యువతికి వచ్చే పెళ్లి సంబంధాలను కాకుండా చేశాడు. పెళ్లి జరిగాక కూడా యువతికి మెసేజ్‌లు పెట్టడం, అవి కాస్త ఆమె భర్త కంటపడడంతో ఆ యువతిని పుట్టింటికి పంపించేశాడు. దీంతో ప్రేమికుడైన వెంకటేష్‌కు ఈ విషయం చెబితే అతని నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడంతో ఆ యువతి బుధవారం దిశ యాప్‌ను ఆశ్రయించింది. తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకుంది. దీనిపై దిశ కేంద్రస్థానం అమరావతి నుంచి జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి చోడవరం పోలీస్‌స్టేషన్‌కు ఆగమేఘాలపై ఆదేశాలు అందాయి. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు సిబ్బందితో దుద్దుపాలెం శివారు బుచ్చియ్యపేట చేరుకుని ఇరు వర్గాలను పిలిపించారు. ఏది ఏమైనా తనకు తనను ప్రేమించానని వెంటపడిన వెంకటేష్‌తో వివాహం జరిపించాల్సిందేనంటూ బాధిత యువతి పట్టుబట్టడంతో గురువారం సాయంత్రం చర్చలు జరిపారు. ఎట్టకేలకు కథ సుఖాంతమయ్యింది. తమ కుల పట్టింపులను పక్కన పెట్టి ప్రేమికులిద్దరినీ ఒక్కటి చేయడానికి ఇరు కుటుంబాలు అంగీకరించాయి. దీంతో యువతి తన ఫిర్యాదును వెనక్కి తీసుకుంది. ఈ విషయంలో వరుడి కుటుంబం పెద్ద మనసు చూపింది. ఇప్పటికే బాధిత యువతికి వివాహం జరిగినా, ఇష్టం లేని వివాహబంధాన్ని బలవంతంగా కొనసాగించలేమని, చట్టపరంగా ప్రేమికుడితో యువతి వివాహానికి అడ్డు లేకుండా చేయడానికి అంగీకరించారు. దీంతో దిశ యాప్‌ను ఆశ్రయించిన యువతికి కోరుకున్న పరిష్కారం లభించిందని పలువురు అభినందిస్తున్నారు.

కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం: ఏపీపీఎస్సీ శుక్రవారం నిర్వహించనున్న కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డీఆర్వో తన ఛాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ అధికారి గ్రేడ్-2, వీఆర్‌ఓ గ్రేడ్-1, హెచ్‌వోడీలు, డైరెక్టరేట్‌లలో కారుణ్య ప్రాతిపదికన నియమితులైన ఉద్యోగులకు ఏపీపీఎస్సీ కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తోందన్నారు. పెదగంట్యాడలోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రంగా పరీక్ష జరుగుతుందనీ, 402 మంది హాజరుకానున్నారని తెలిపారు.

గిరిజనుల భూములు కాపాడుకోవాలి

8లో

అల్లం ఘాటు

- దిగుబడి తగ్గడంతో కిలో రూ.300
- మరో నెల రోజులు ప్రియంగానే ఉంటుందంటున్న వ్యాపారులు



మార్కెట్లో అమ్మకానికి తెచ్చిన అల్లం

అనకాపల్లి రూరల్: అల్లం సామాన్యుడు కొనలేని స్థితికి చేరుకుంది. ఉత్పత్తి, సరఫరా అంతరంతో ధరలు పైపైకి చేరుకుంటున్నాయి. కిలో రూ.300 వెచ్చిస్తే గాని కొనలేని పరిస్థితి నెలకొంది. ఒక వైపు శుభకార్యాలు, జాతరలు, మరోవైపు పచ్చళ్ల సీజన్ కావడంతో వినియోగం పెరిగింది. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో 20 రోజుల్లో అల్లం ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల మార్కెట్లు, రైతు బజార్లలో కిలో అల్లం రూ.240 నుంచి రూ.280కి చేరుకుంది. బహిరంగ మార్కెట్లో మరో రూ.50 అదనంగా పలుకుతోంది. ఏప్రిల్‌లో కిలో రూ.150 ఉన్న ధర క్రమంగా పెరుగుతూ రూ.238కి చేరింది. ఆయా రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న అల్లం 50 కేజీల బస్తాను రూ.10 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అందులో నాలుగైదు కిలోల తరుగుపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. హోల్‌సేల్‌గా కిలో రూ.238కి అమ్ముతున్నారు. కూరగాయల మార్కెట్లలో మాత్రం వంద గ్రాములను రూ.30కి విక్రయిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి అల్లం దిగుమతి అవుతోంది. ఈ రాష్ట్రాల్లో దిగుబడిలేక సరఫరా తగ్గడంతో ధర అమాంతం పెరిగిపోయింది. రోజుకు 20 నుంచి 25 టన్నుల సామర్థ్యమున్న మూడు లారీల సరుకు జిల్లాలో విక్రయమవుతోంది. గత కొంతకాలంగా ధర పెరుగుతుండటంతో మండే ఎండల ధాటికి సరుకు పాడైతే నష్టపోవాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు దిగుమతిని తగ్గించారు. దీంతో వంటకాల్లో ఆచితూచి వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో ఉండే సాధారణ కిరాణా దుకాణాల్లో చాలావరకు అల్లం అమ్మకాలు నిలిపివేశారు. గత రెండ్రోజులుగా యలమంచిలిలో 90 శాతం కూరగాయల దుకాణాల్లో అల్లం అమ్మడమే లేదు. కేవలం పెద్ద దుకాణాల వారు మాత్రమే విక్రయిస్తున్నారు. ఈ వేసవిలో ఆయా రాష్ట్రాల్లో పంట దిగుబడి లేకపోవడంతో డిమాండ్‌కు తగ్గ సరుకు లేక ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. మరో నెల రోజుల వరకు అల్లం ధరలు ప్రియంగానే ఉంటాయని వారు చెబుతున్నారు.

పేదలకు స్పెషల్ వైద్యం

- ఏరియా ఆస్పత్రిలో 9 మంది స్పెషలిస్టులు
- రోగులకు మెరుగైన వైద్య సేవలు



క్యూ లైన్‌లో రోగులు



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి

నర్సీపట్నం: గతంలో సాధారణ వైద్య సేవలే గగనంగా మారిన ఏరియా ఆస్పత్రిలో స్పెషలిస్టుల సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ వైద్య సేవలు అందించటంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు పొందింది. మైదాన ప్రాంతంలోని 12 మండలాలు, ఏజెన్సీలోని మూడు మండలాల ప్రజలకు ఈ ఆస్పత్రి పెద్దదిక్కుగా ఉంది. ఈ నేపథ్యంలో పీజీ వైద్య విద్యనభ్యసించే వైద్యులు రెండేళ్లు రూరల్ ప్రాంతంలో వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు కావడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి.

రూ.14 కోట్లతో అధునాతన సౌకర్యాలు

ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం పర్మినెంట్ వైద్యులు 19 మంది వైద్య సేవలు అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించడంతోపాటు ప్రభుత్వం రూ.14 కోట్లతో అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆంధ్రా మెడికల్ కళాశాల, గీతం, గాయత్రిలో వైద్య విద్యనభ్యసిస్తున్న తొమ్మిది మంది స్పెషలిస్టులను ఏరియా ఆస్పత్రికి కేటాయించారు.

ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, రేడియాలజిస్టు, ఆప్తాల్మాలజిస్టు, జనరల్ సర్జన్స్-2, మానసిక వైద్య నిపుణులు, గైనిక్, చిన్నపిల్లల స్పెషలిస్టుల సేవలు అందుబాటులోకి వచ్చాయి. పర్మినెంట్ వైద్యులు, స్పెషలిస్టుల రాకతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయి.

స్పెషలిస్టులతో ప్రయోజనం



గతంలో స్పెషలిస్టుల వైద్యులు లేక రోగులు మెరుగైన వైద్య సేవలు అందించలేకపోయాం. ప్రస్తుతం పర్మినెంట్ వైద్యులకు తోడు తొమ్మిది మంది స్పెషలిస్టులు నియామకంతో రోగులకు సత్వర సేవలు అందుతున్నాయి. స్పెషలిస్టులు అందరూ కీలకమైన విభాగానికి చెందిన వారు కావటం విశేషం.

– ఎం.నీలవేణిదేవి, ఏరియా ఆస్పత్రి, సూపరింటెండెంట్

క్లుప్తంగా

ఇగ్నో ప్రవేశాలకు జూన్ 30 గడువు


ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)-2023లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్‌లో ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ డీడీగా శ్రీనివాస కుమార్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా సీహెచ్ శ్రీనివాసకుమార్‌ను నియమించారు. ఇక్కడ డీడీగా పనిచేసిన భక్తవత్సల్యను కడప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ కుమార్ కేజీహెచ్‌లో పరిపాలన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- పలు చోట్ల భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా



బుచ్చెయ్యపేట: బుదిరెడ్లపాలెం వద్ద కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో వస్తున్న మంటలు





కోటవురట్ల: పాములవాక శివారున మెయిన్‌రోడ్డుకు అడ్డుగా విరిగి పడిన చెట్టు కొమ్మ, (ఇన్‌సెట్) బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: మండలంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుకుని భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడి జనం ఈ వర్షంతో సేద తీరారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. అయితే భారీ ఈదురు గాలులకు మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. చాలా ప్రాంతాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పలు చోట్ల రహదారుల్లో చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. యండపల్లి–జల్లూరు మధ్యలోనూ రామచంద్రపురం జంక్షన్‌కు సమీపంలోనూ చెట్లు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చెట్లను పక్కకు తొలగించి రాకపోకలు సాగించారు. పాములవాకలో సుర్లవానిపాలెం నుంచి పట్టాలమ్మతల్లి ఆలయం వరకు పలు వృక్షాలు నేలకొరగడంతోపాటు చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. పొలాల్లో కొబ్బరి, తాటి చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు విరిగిన చెట్లను పొక్లెయిన్‌తో పక్కకు తొలగింపజేసి రాకపోకలకు వీలు కల్పించారు.

బుచ్చెయ్యపేటలో పిడుగులతోపాటు భారీ వర్షం

బుచ్చెయ్యపేట: మండలంలో ఈదురు గాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పీడీ పాలెం, లోపూడి, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతోపాటు భారీ శబ్దాలతో పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పశువులు, గొర్రెలను పొలాల్లోకి మేతకు తీసుకెళ్లిన కాపరులు, పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు పిడుగుల శబ్దానికి భీతిల్లారు. బుదిరెడ్లపాలెంలో గ్రామ శివారులో కొబ్బరిచెట్టుపై పిడుగు పడగా, వర్షంలోనూ కాలిపోయింది. రాత్రి వరకు వర్షం కురవగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఎంపీ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభం



కలెక్టరేట్‌లో ఎంపీ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ సత్యవతి

తుమ్మపాల: పరిపాలన వికేంద్రీకరణతో గ్రామాభ్యుదయానికి పెద్దపీట వేస్తూ సాగుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీ ఫెసిలిటేషన్ సెంటర్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ముందుగా వినాయక పూజ చేసి రూ.60 లక్షల ఎంపీ నిధులతో యలమంచిలి నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్యనిర్వాహక కేంద్రమైన కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు తన కార్యాలయం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఇప్పటివరకు తన ఎంపీ నిధుల నుంచి రూ.10 కోట్లు ఖర్చుపెట్టి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలు పూర్తి చేశామన్నారు. నీటిపారుదల, రోడ్లు, సారశక్తి, శ్రీజల, భవన నిర్మాణం మొదలైన పనులకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 20 దత్తత గ్రామాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ముఖ్యప్రణాళిక అధికారి జి.రామారావు వివిధ అభివృద్ధి పనులపై మాట్లాడారు. అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేస్తున్న వివిధ శాఖల అధికారులను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ వీరునాయుడు, సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులావాణి, మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, వివిధ శాఖల అధికారులు, డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 'గడపగడపకు'

- గిరిజన గ్రామాలకు వెళ్లిన రెండో ఎమ్మెల్యే గణేష్



పోలీసు బందోబస్తు మధ్య కొండలెక్కుతున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: మావోయిస్టు ప్రభావిత గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తొలిసారి పర్యటించారు. సుందరకోట పంచాయతీ, కృష్ణాపురం, తదితర గ్రామాల్లో ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేది. ఇక్కడకు రావడానికి ఏ ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధిగానీ సాహసించేవారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి చింతపల్లి సీపీఐ ఎమ్మెల్యే జి.దేముడు మినహా ఇంతవరకు టీడీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలెవ్వరూ పర్యటించలేదు. పలు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆ గ్రామాలపై కనీసం కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పుణ్యమా అని ఎమ్మెల్యే పెట్ల గణేష్ గురువారం సుందరకోటకు కొండలెక్కి వెళ్లారు. ఆయన రాకతో గిరిజనుల్లో ఆనందం వెల్లివిరిసింది. రెట్టింపు ఉత్సాహంతో థింసా నృత్యంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన వాడల్లో ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను స్వయంగా నోట్ బుక్‌పై రాసుకున్నారు. వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మద్యం మత్తులో కత్తితో దాడి.. ఒకరు మృతి



మృతి చెందిన చిన్నారావు

గూడెంకొత్తవీధి : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు కారణమైంది. ఈ ఘటనలో గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ కొండకించంగి గ్రామానికి చెందిన గెమ్మెలి చిన్నారావు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూజారి మల్లన్న అదే గ్రామానికి చెందిన చిన్నారావు స్నేహితులు. వీరిద్దరూ బుధవారం రాత్రి మద్యం సేవించారు. అంతకు ముందు మల్లన్న భార్యతో చిన్నారావు ఘర్షణ పడినట్టు చెబుతున్నారు. తన భార్యపై చేయి చేసుకుంటావా.. అంటూ మల్లన్న చిన్నారావుతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో అతని వద్ద ఉన్న కత్తితో చిన్నారావు మెడపై దాడిచేశాడు. దీంతో చిన్నారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని కుటుంబ సభ్యులు చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా చిన్నారావు మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీకే వీధి పోలీసులు తెలిపారు.

గ్రామంలో అశాంతి సృష్టిస్తే సహించేది లేదు

- పి.జగ్గంపేట గ్రామస్తులకు నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరిక



పి.జగ్గంపేటలో ఇరువర్గాలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నాతవరం: దేవుళ్ల పేరుతో గ్రామంలో అశాంతి వాతావరణం సృష్టిస్తే ఊరుకునేది లేదని నర్సీపట్నం డీఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పి.జగ్గంపేటలో దేవాలయ నిర్మాణ విషయంపై ప్రార్థనా మందిరం నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండింటి మధ్య చాలా దూరం ఉందని, ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని సర్పంచ్ జి.సోమన్నదొర సూచించారు. అయితే ఈ వివాదం పెద్దదై జిల్లా స్థాయి అధికారుల దృష్టికి చేరింది. పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉండటంతో గురువారం డీఎస్పీ ఇక్కడ ప్రార్థనా మందిరంతోపాటు నూతనంగా ఆలయం నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామసభలో ఇరువర్గాల వాదన విన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుళ్ల పేరుతో రాద్ధాంతం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దేవుళ్లు వేరైనా రెండు మతాల వారు గ్రామంలో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. రెచ్చగొట్టే ధోరణి ప్రదర్శిస్తే ఎలాంటి చర్యలకైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చివరికి ఇరు పక్షాల పెద్దలు అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని హామీ ఇచ్చారు. నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ సోమన్నదొర, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులు దోమ తెరలు విధిగా వాడాలి

- వాలాబులో జిల్లా మలేరియా అధికారి వరహాలదొర అవగాహన



వాలాబులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంవో వరహాలదొర

దేవరాపల్లి: ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడటం ద్వారా మలేరియా బారిన పడకుండా రక్షణ పొందవచ్చునని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి కె. వరహాలదొర సూచించారు. మండలంలోని గరిశింగి గ్రామ సచివాలయం పరిధి గిరిజన పంచాయతీ వాలాబులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి దోమతెరల వినియోగంతోపాటు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. నీటి నిల్వలు ఉన్న చోట లార్వా వృద్ధి చెందుతుందని, నివారణకు ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలిత నిర్వహించారు. అక్కడ జ్వరపీడితురాలు వండ్లపు దేవిని ఆయన పరీక్షించి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు జి.కె.పుష్పరాజ్, ఎ. మహేష్, హెల్త్ అసిస్టెంట్ గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల భూములు కాపాడుకోవాలి



సమావేశానికి హాజరైన ఆదివాసీలు,



సమావేశంలో మాట్లాడుతున్న సత్యదేవ్‌రామ్

- ఏఐఏఆర్‌ఎల్‌ఏ జాతీయ అధ్యక్షుడు సత్యదేవ్‌రామ్

అనకాపల్లి టౌన్: ఏజెన్సీల్లో గిరిజనేతరుల చేతిలో మన భూములు కాపాడుకోవాలని, లేదంటే ఆదివాసీ సంతతి కనుమరుగై పోతుందని బీహార్ రాష్ట్రం పాట్నా ఎమ్మెల్యే, అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం(ఏఐఏఆర్‌ఎల్‌ఏ) జాతీయ అధ్యక్షుడు సత్యదేవ్‌రామ్ అన్నారు. స్థానిక న్యూకాలనీ తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్లో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జిల్లా ఐదో మహాసభకు గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష ఏదైనప్పటికీ గ్రామీణ కార్మికుల సమస్యలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కువగా రైతులు ఏపీలోనే ఉన్నారని, వీరంతా వ్యవసాయ కార్మిక సంఘాలు ఏర్పడి హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటాలు చేయాలని సూచించారు. పేదల సమస్యలను పక్కతోవ పట్టించడానికి మోదీ ప్రభుత్వం మతోన్మాదం అనే కొత్త వాదాన్ని అనుసరిస్తుందన్నారు. ప్రధాని మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు చేసేందుకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ, పంజాబ్‌లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తున్నారని, మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1,500 నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, పార్లమెంట్ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నగల వ్యాపారం పేరిట మోసంపై ఫిర్యాదు

కశింకోట : నగల వ్యాపారం ద్వారా లబ్ధి పొందవచ్చునని నమ్మించి రూ.లక్షల్లో నగదు వసూలు చేసి మోసగించాడనే అభియోగం మీద ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. అనకాపల్లికి చెందిన శ్రీను అనే వ్యక్తి క్యూనెట్ సంస్థ ద్వారా బిజినెస్ చేస్తే అధిక లాభం వస్తుందని ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన గొంపనబిల్లి కోటేశ్వరరావును నమ్మించి బలవంతంగా 2021 మార్చి నుంచి మూడు దఫాలుగా సాక్షుల సమక్షంలో రూ.8 లక్షలు తీసుకున్నాడు. దీనిలో భాగంగా సంస్థ తరపున నకిలీ నగలు తీసుకొచ్చి వాటి విలువ రూ.2.35 లక్షలు ఉంటుందని నమ్మించాడు. అయితే ఈ వ్యాపారం తాను చేయలేనని నిరాకరించిన కోటేశ్వరరావు తాను ఇచ్చిన రూ.8 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరగా శ్రీను తాత్సారం చేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో 20 రోజుల క్రితం శ్రీను ఉగ్గినపాలెం గ్రామం వెళ్లగా తన సొమ్ము కోసం కోటేశ్వరరావు నిలదీశాడు. దీంతో సొమ్ము పది రోజుల్లో ఇస్తానని అప్పటి వరకు తన కారు హామీగా ఉంచుకోమని శ్రీను కారు వదిలి వెళ్లాడు. తరువాత కూడా తన సొమ్ము ఇవ్వకపోవడంతో కోటేశ్వరరావు మళ్లీ వెళ్లి నిలదీయగా సొమ్ము ఇవ్వడానికి నిరాకరించడమే కాకుండా కారు కూడా లాక్కుని, తిరిగి కేసు పెడతానని బెదిరించాడు. దీంతో చేసేది లేక మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కోటేశ్వరరావు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. అయితే ఈ నెల 7న ఉగ్గినపాలెం వెళ్లగా కోటేశ్వరరావు, మరికొందరు తాను క్యూనెట్ బిజినెస్‌లో పెట్టిన నగదు ఇవ్వాలని, లేదంటే వెళ్లనిచ్చేది లేదని అడ్డుకొని కారు తీసుకున్నారని శ్రీను కూడా ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో మరో కేసు నమోదు చేశామన్నారు.

మాలమహానాడు రాష్ట్ర మహిళాధ్యక్షురాలిగా మల్లేశ్వరి



నియామక పత్రం అందుకుంటున్న నాగమల్లేశ్వరి

సీతంపేట: మాలమహానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ మంచ నాగమల్లేశ్వరిని నియమించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ హోప్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి మహిళలంతా ఉన్నత స్థానంలో ఉండాలని కృషి చేస్తున్న నాగమల్లేశ్వరి సేవలను గుర్తించి రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించినట్టు తెలిపారు. ఇక నుంచి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాల మహానాడు ద్వారా పోరాటం చేస్తారన్నారు. రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరి నన్నేటి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కశింకోట : మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువు కోసం జీలుగ, జనుం, పిల్లి పెసర విత్తనాలు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి స్వప్న గురువారం తెలిపారు. పది కిలోల జీలుగ రూ.395, జనుం రూ.420, 8 కిలోల పిల్లి పెసర రూ.388 వంతున పంపిణీ చేస్తామన్నారు. వీటి కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్ కార్డుతో విత్తనాల ధర చెల్లించి, తమ పేర్లను నమోదు చేసుకుంటే చాలన్నారు. నమోదు చేసుకున్న వారిని వారు కోరుకున్న మేరకు విత్తనాలు అందిస్తామన్నారు.

ధర పెరిగిన టమాటా

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర పెరిగింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం రూ.30కి పెరిగింది. ఉల్లిపాయ ఎప్పటిలాగే రూ.20, వంకాయ, బంగాళాదుంప రూ25, క్యాబేజీ రూ.30, బెండకాయ రూ.40, దొండకాయ, బీట్‌రూట్, క్యారెట్ రూ.60కి విక్రయాలు సాగాయి. అల్లం కిలో రూ.250కి అమ్మకాలు జరిగాయి.

ఏపీటీఎఫ్ నేత బొండా మృతికి సంతాపం

కశింకోట : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ నాయకుడు బొండా అప్పారావు మృతి తీరని లోటని, గురువారం పలువురు తమ సంతాపం తెలిపారు. కశింకోట 1వ బాలుర ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా అప్పారావు నిజాయితీగా సేవలందించారని, ఆయన సేవలు మరువలేనివని విశ్రాంత ఎంఈవో నంబా రమణ, కశింకోట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.గోపాలరావు, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు పి.గణపతి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన మృతి తీరని లోటన్నారు.

1న దుర్గమాంబ పండగ


దుర్గమాంబ

పరవాడ: స్థానికంగా కొలువైన శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగను పైల వారి కుటుంబ సభ్యులు జూన్ 1న వైభవంగా నిర్వహించనున్నారు. పండగ సన్నాహాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పుట్టుక కార్యక్రమం సందర్భంగా పెద్దింటి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం నుంచి అమ్మవారి ఘటాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించి, చివరి రోజు అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటి ప్రతినిధులు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 273 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	4,830
రెండో రకం	4,080	4,550
మూడోరకం	3,800	4,020

అనకాపల్లి సినిమాలు

కస్టడీ : రాజా
రామబాణం : సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే : సత్యనారాయణస్క్రీన్-2
2018 : షిర్డీసాయి
ఉగ్రం : పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10 : వెంకటేశ్వర
మళ్లీ పెళ్లి : శ్రీసత్య
బిచ్చగాడు-2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, ఏ నెగిటివ్-1యూనిట్, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-40 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రజారోగ్యం.. మెరుగైన సేద్యం

పట్టణ పరిధిలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాలి. మురుగునీటి కాలువల్ని శుభ్రం చేయాలి. పంట కాలవల్లో మురుగు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు సాగునీ రందించే ప్రధాన కాలువల్ని సంరక్షించాలి. ఇదే లక్ష్యంగా జీవీఎంసీ రూ.1.73 కోట్లు నిధులు వెచ్చిస్తోంది. దీంతో పట్టణంలోని డ్రైనేజీలతోపాటు యల్లయ్య, ఊళ్ల, నాగులాపల్లి కాలువలకు మహర్దశ పట్టనుంది.


నాగులాపల్లి కాలువలో పేరుకుపోయిన తుప్పలు (ఇన్‌సెట్) ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన యల్లయ్య కాలువ

- కాలువల్లో పూడిక తొలగింపునకు రూ.1.73 కోట్లు
- యల్లయ్య, ఊళ్ల, నాగులాపల్లి కాలువలకు మహర్దశ
- వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు
- జీవీఎంసీ డ్రైనేజీ, పంట కాలువల పునరుద్ధరణకు చర్యలు

అనకాపల్లిటౌన్ : ప్రజారోగ్య పరిరక్షణతోపాటు, పూడుకుపోయిన కాలువల పునరుద్ధరణకు జీవీఎంసీ నడుం బిగించింది. రూ.కోటీ 73 లక్షలతో పనులు ప్రారంభించేందుకు జీవీఎంసీ అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో పట్టణంలోని మురుగు కాలువలతోపాటు, పంటకాలువలు, వాటి కిరువైపులా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. పట్టణ పరిధిలో 17 పనులతో 18 కిలోమీటర్ల మేర కాలువలు బాగుపడనున్నాయి.

అటకెక్కిన ఒప్పందం

మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాల గుండాల కూడలి నుంచి లక్ష్మీదేవిపేట, మిరియాలకాలనీ, వేల్పులవీధి, ఎన్టీఆర్ వైద్యాలయ రహదారి, పూల్‌బాగ్‌రోడ్డు, గవరపాలెం దోబీకాలనీ, సంతబయల మీదుగా ప్రధాన పంట కాలువ(యల్లయ్య) ఉంది. సుమారు 7 కిలోమీటర్ల పొడవున ఆవఖండం భూముల్లోకి నీరందించే ప్రధాన వనరు ఇదే. దీనికి ఇరువైపులా జీవీఎంసీ కాలువలను నిర్మించారు. యల్లయ్య కాలువను జీవీఎంసీకి ఇరిగేషన్‌శాఖ అప్పగించింది. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఈ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలగించేలా ఒప్పందం జరిగింది. తీసేందుకు రెండు శాఖల అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది మాత్రమే పంట కాలువతోపాటు జీవీఎంసీ కాలువలను కూడా శుభ్రపరచాల్సి ఉంది. గత రెండు మూడేళ్లుగా ఈ ఒప్పందం అటకెక్కింది.

పంట కాలువల్లోకి పట్టణ మురుగు

జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఠంచనుగా డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో ఈ పూడిక పంటకాలువల్లోకి చేరుతోంది. ఇటీవల కాలంలో పంటకాలువలో పూడిక దిబ్బలుగా పేరుకుపోయింది. దీంతో పంట పొలాలకు సాగునీరందట్లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై పలుమార్లు జీవీఎంసీ జోనల్ అధికారులకు మొరపెట్టుకున్నారు. స్థానిక కార్పొరేటర్లను కూడా కలిసి, తమ గోడు విన్నవించుకున్నారు. ఈ సమస్యపై కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు కావడంతో వారం రోజుల్లో పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు సన్నద్ధం కావడంతో రైతులు, పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



పూడిక తొలగింపు పనులకు టెండర్లు పిలిచాం. టెండర్ ప్రక్రియ చివరి దశకు వచ్చింది. వారం రోజుల్లో పనులు మొదలుకానున్నాయి. యల్లయ్యకాలువతోపాటు, ఊళ్లకాలువ, నాగులాపల్లి కాలువల్లో కూడా పూడికతీత పనులు చేపడతాం. రానున్న వర్షాకాలానికి కాలువ పునరుద్ధరణ పనులు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.వెంకటరమణ, జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్

చిరు జల్లులతో ఉపశమనం


ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో తేలికపాటి వర్షం

అనకాపల్లిటౌన్ : పట్టణ వాసులు గురువారం మధ్యాహ్నం వరకు 38.8 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడిపోయారు. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశానికి మబ్బులుపట్టి, ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉక్కబోత నుంచి పట్టణవాసులు కాస్త సేదతీరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అప్పుడప్పుడు కురిసిన జల్లులు చల్లదనాన్నిచ్చాయి. మబ్బుల వాతావరణం మాత్రం అలానే కొనసాగింది. రాత్రి 7.30 గంటల సమయంలో భారీ ఈదురుగాలులతో మరోసారి వర్షం పడింది. వర్షానికి ముందు వీచిన గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎటూ చూసినా అంధకారం. ఆపై ఆకాశం మెరుపులు, ఉరుములతో వర్షం. దీంతో పనులు ముగించుకుని తమ నివాసాలకు చేరాలనుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కశింకోట : కశింకోట ప్రాంతంలో గురువారం రాత్రి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వేసవి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు సూర్య తాపంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. అత్యధిక శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం ఆకాశంలో కారు మేఘాలు కమ్ముకుని, ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రాత్రి కాసేపు తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణం కాస్త చల్లబరిచింది.

ఘనంగా మారువారం పండగ


బంగారమ్మ, కుంచాలమ్మ సన్నిధిలో సీఐ రంగనాథం, గ్రామస్తులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్ల వద్ద కొలువుదీరిన గ్రామ దేవతలు బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల మారువారం పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు బారులుతీరి అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక సీఐ పైడి రంగనాథం అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, జోడుగుళ్ల యువత పాల్గొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు


రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ

పరవాడ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మీశ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట ఎరువులను అందించారు. అనంతరం వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం జనుము 12 క్వింటాళ్లు, జీలుగ 17 క్వింటాళ్లు, పిల్లి పెసర 3 క్వింటాళ్లు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం సరఫరా చేసిన కొత్త రకం వేరు శనగ విత్తనాలను రైతులకు అందజేసినట్టు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు సంబంధిత అధికారులను సూచించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకుని, భూసారాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఏఎంసీ డైరెక్టర్ దలాయి రాము, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు కె.సీతారామయ్య, కావలి అప్పలరాజు, రొంగలి గంగరాజు, ఎస్.సన్యాసినాయుడు, ఎస్.అప్పలనాయుడు, వ్యవసాయ సహాయ విస్తరణాధికారి ఎం.ఎస్.మూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

అనకాపల్లిటౌన్ : నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యాలను పెంచి, వారికి ఉపాధి అవకాశాల్ని విస్తృతం చేసేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తోందని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చక్రవర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిరుద్యోగ యువతకు ఉచితంగా ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ప్రైవేట్ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్నవారితో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 7013342667 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

నర్సింగరావుపేటలో 'గడప గడపకు' రేపు


సమావేశంలో మాట్లాడుతున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 27న నర్సింగరావుపేట 4వ సచివాలయం పరిధిలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. స్థానిక 4వ సచివాలయ పరిధిలో సచివాలయ ఉద్యోగులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై, నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం రహదారిలో రూ.26 లక్షల నిధులతో నిర్మించనున్న డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నేతలు కొందూరి రవీంద్రనాథ్, కుండల రామకృష్ణ, అల్లు త్రినాథ్, కూండ్రపు సత్తిబాబు, చవితిని నూకరాజు, పేలూరు కల్యాణ్, కోన ఉమ, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'రైతులకు పంట నష్టం చెల్లించాలి'


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

తుమ్మపాల : అకాల వర్షాలతో పంటనష్టం ఏర్పడిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆర్డీవో చిన్నికృష్ణకు గురువారం వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నువ్వులు, టమాటా, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయని ఉమ్మడి జిల్లా బీసీ ఫెడరేషన్ చైర్మన్ విల్లూరి పైడారావు అన్నారు. అనకాపల్లి ఆవఖండం, మునగపాక, కశింకోట మండలాల రైతులు చాలా వరకు నష్టపోయారని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికే వివరాలు రాసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో నష్టపరిహారం చెల్లింపులు జరుగున్నాయని, అనకాపల్లి జిల్లాలో మాత్రం రైతులకు నష్టపరిహారం ఇంకా చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, అబ్దుల్ కలాం సేవా సంఘం చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, అంబేడ్కర్ సేవా సమితి కోఆర్డినేటర్ బండి అప్పారావు, రైతు సంఘం నాయకులు ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం


మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వెంకటరావు

కశింకోట : వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటరావు కోరారు. కశింకోట శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న తీరును, గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని అందించే అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని చదివి విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరంలో నిర్వహిస్తున్న ఆటలు, పాటలు, నృత్య పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాలన్నారు. ఉపాధ్యాయుడు సూరా శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఆంగ్ల గ్రామర్ తరగతులను పరిశీలించారు. ఆయన వెంట గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

దేవాలయం కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు


ఆధ్యాత్మిక ప్రచార కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పరవాడ: ప్రతి గ్రామంలో దేవాలయం కేంద్రంగా నెలకోసారి సామూహిక హారతి, ప్రతీ వారం భజన కార్యక్రమాలను నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. ముత్యాలమ్మపాలెం ముత్యమాంబ ఆలయంలో గురువారం నిర్వహించిన ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భజన ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి స్టిక్కర్లు, కరపత్రాలను అందించాలన్నారు. గ్రామంలో అనారోగ్యంగా ఉన్న వారిని, ఆత్మీయ బంధువుల్ని గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి, అందరూ బాగుండాలని కోరుతూ గ్రామ ధార్మిక జట్టుతో గ్రామంలో హోమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వాసుపల్లి సోమశేఖర్, ఎ.కొండమ్మ, సూరాడ బోగమ్మ, ఎ.నూకమ్మ, కొండబాబు, నల్లయ్య, రామకృష్ణ, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి

మునగపాక: అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ మన్మథరావు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో గురువారం గ్రామ శాంతి కమిటీ(విలేజ్ పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మన్మదరావు మాట్లాడుతూ పేకాట, జూదం ఆడినట్టయితే చర్యలు తప్పవన్నారు. అలాగే చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. వివాదాలకు తావులేకుండా చిన్న చిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. మహిళా పోలీసు భీమిశెట్టి సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు జామిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం


చూచుకొండలో సత్కారం పొందిన వలంటీర్లు

మునగపాక : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మండలంలోని చూచుకొండ,గణపర్తి గ్రామ వలంటీర్లను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తమకు కేటాయించిన 50 గృహాలకు సకాలంలో సేవలందించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు, పీఏసీఎస్ ఇన్‌చార్జి హరేరామ, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథస్వామి వారి దేవస్థానం

దేవాదాయ ధర్మాదాయశాఖ, గవరపాలెం, అనకాపల్లి

టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా మరియు పట్టణం, గవరపాలెంలో వేంచేసియున్న శ్రీజగన్నాథ స్వామి వారి దేవస్థానం యొక్క రథయాత్ర సందర్భముగా తే 21-06-2023 నుండి 29-06-2023 (తిరుగు రథయాత్ర) వరకు భక్తులచే సమర్పించి వదిలివేయబడిన కొబ్బరికాయలందలి సగభాగములను ప్రోగుచేసుకొని తీసుకొను హక్కు కొరకు తేది. 03-06-2023 ఉదయం 10.00 గంటలకు దేవాలయం వద్ద టెండరు కమ్ బహిరంగ వేలం పాట జరుపబడును.

పాట షరతులు:
1. ఈ వేలంపాట హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడును.
2. ఈ వేలంపాటలో పాల్గొనువారు రూ. 15,000/-లు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాట ముగిసిన పిమ్మట హెచ్చుపాటదారు హెచ్చుపాట మొత్తము వెంటనే చెల్లించవలెను.
3. టెండరు వేయు వారు ప్రథమ ధరావత్తు సొమ్మును ఏదైనా జాతీయ బ్యాంకు నుండి కార్యనిర్వహణాధికారి, శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం, అనకాపల్లి వారి పేరున డి.డి.తీసి టెండరు ఫారంతోపాటు జతపర్చి సమర్పించవలెను.
4. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వేలంపాటదారులు ఆధార్ కార్డు జిరాక్సు కాపీ పాట కాలము నందు సమర్పించవలెను.
5. మిగిలిన పాట షరతులను దేవస్థానం కార్యాలయం పనివేళలలో తెలుసుకొనవచ్చును.

అనకాపల్లి
తే.22-05-2023

ఇట్లు
కార్యనిర్వహణాధికారి

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి


వెదురుపర్తి హైస్కూలులో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి


ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్‌ను మహిళకు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఎంపీ సత్యవతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం, ప్రారంభోత్సవం

కశింకోట : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. స్థానికులకు కలిగిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను స్థానికులకు అందించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కశింకోట నుంచి వెదురుపర్తి వరకు రూ.కోటీ 91 లక్షలతో అభివృద్ధి చేసిన తారు రోడ్డును, హైస్కూల్లో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం రూ.46.91 లక్షలతో నిర్మించిన ఐదు గదుల భవనాన్ని ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం వరకు నెరవేర్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు అండగా నిలవాలని అభ్యర్థించారు. సీఎం జగన్ తనకు ప్రతి నెల పింఛన్ సొమ్ము అందించి పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారని వెదురుపర్తికి చెందిన కాండ్రేగుల జగ్గయ్యమ్మ మంత్రి వద్ద తన ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో భాగంగా ఇంటికీ వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ సంక్షేమ పథకాలపై రూపొందించిన కర పత్రాన్ని ఆమెకు అందించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. దీంతో ఆమె తన ఆనందాన్ని పంచుకుంది. తనకు ఇద్దరు కుమారులున్నారని, వారి కంటె పెద్ద కుమారునిగా సీఎం జగన్ ప్రతి నెలా పింఛన్ రూ.2750 అందించి, ఆదుకుంటున్నారని తెలిపారు. ఇంత కన్నా తమకు ఏం కావాలని ఉబ్బితబ్బిబ్బయింది. దీంతో మంత్రి ఆమెను అక్కున చేర్చుకుని ముఖ్యమంత్రిపై చూపుతున్న ఆదరాభిమానాలకు అభినందించారు. త్వరలో పింఛన్ సొమ్ము మూడు వేలు చేస్తారని, దాన్ని కూడా అందుకుంటావని మంత్రి భరోసా ఇచ్చి ముందుకు సాగారు.

వర్షంలో గడప గడపకు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో వర్షం పడింది. అయినప్పటికి కార్యక్రమాన్ని నిలపకుండా కొనసాగించారు. తడవకుండా మంత్రి, ఎంపీలకు స్థానికులు గొడుగులు పట్టారు. కార్యక్రమం సందర్భంగా మంత్రి అమర్‌నాథ్, ఎంపీ వెంకటసత్యవతిలను పూలదండలు, దుశ్శాలువాలు, జ్ఞాపికలతో స్థానికులు ఘనంగా సత్కరించారు. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీ భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి స్వప్న, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.